
వికారాబాద్

బుధవారం । 5 । మార్చి । 2025



ప్రదక్షిణలు.. పడిగాపులు

రుణమాఫీ పూర్తిస్థాయిలో ఎప్పుడు అమలవుతుందోనని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. 8లో▸



ఉద్యాన పంట..

ప్రభుత్వం సబ్సిడీలు నిలిపివేయడంతో కూరగాయలు సాగు చేసే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



వికారాబాద్ జీజేసీలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న అధ్యాపకులు

అనంతగిరి: ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి ఎస్.శంకర్ అన్నారు. మొదటి సంవత్సరంలో జనరల్ 6,418 మంది, ఒకేషనల్ 1,496 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి జనరల్ 5,589 ఒకేషనల్ 1,374 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు నియామవళి ప్రకారం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. విద్యార్థులు ఉదయం 8.45 గంటల లోపు పరీక్ష కేంద్రానికి చేరుకునేలా తల్లిదండ్రులు చొరవతీసుకోవాలని సూచించారు. విద్యార్థులను ఉదయం 9.05 గంటల వరకు పరీక్ష కేంద్రం లోనికి అనుమతిస్తామన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించం

అదనపు కలెక్టర్‌కు 5వ వార్డు వాసుల వినతి



అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న కొత్రెపల్లి గ్రామస్తులు

అనంతగిరి: పెండింగ్ నల్లా బిల్లులు చెల్లించమని వికారాబాద్ మున్సిపల్ పరిధి కొత్రెపల్లి గ్రామస్తులు (5వ వార్డు) వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు వారు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.వేలల్లో ఉన్న పెండింగ్ బిల్లులు తాము చెల్లించలేమని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ నీరు సరఫరా చేసినా ఏనాడు నల్లా బిల్లులు వసూలు చేయలేదని గుర్తు చేశారు. ఇప్పటి నుంచి నెలవారీగా చెల్లిస్తామని.. పెండింగ్ బిల్లులు చెల్లించలేమని తేల్చి చెప్పారు. వీరికి సంఘీభావంగా బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ తదితరులు తరలివచ్చారు.

పాంబండలో టెంకాయల విక్రయానికి వేలం

కుల్కచర్ల: పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఏడాది పాటు టెంకాయల విక్రయానికి ఈ నెల 10న వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, ఈఓ బాలనర్సయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉగాది పెద్ద జాతర (18 నుంచి 31వరకు), శ్రావణమాసం చిన్నజాతర సందర్భాలు మినహాయించి ఆలయ ప్రాంగణంలో టెంకాయల విక్రయానికి అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

పసికందును ఇవ్వాలంటే పైసలివ్వాల్సిందే

- ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది డిమాండ్
- బాధితుడి ఫిర్యాదుతో అప్పగించిన వైనం



బాధితుడు అశోక్

షాద్‌నగర్: అప్పుడే పుట్టిన పసికందును కుటుంబ సభ్యులకు అందజేసేందుకు ఆ స్పత్రి సిబ్బంది డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన ఘటన షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. పట్టణంలోని రాంనగర్ కాలనీకి చెందిన బోడ అశోక్ తన భార్య స్రవంతికి పురిటి నొప్పులు రావడంతో మంగళవారం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. వైద్యులు ఆమెకు ఆపరేషన్ చేయడంతో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో కుటుంబ సభ్యు లు ఆనందం వ్యక్తం చేశారు. అంతలోనే ప్రసూ తి నిమిత్తం ఆపరేషన్ చేసినందుకు, పసికందు ను ఇచ్చేందుకు రూ.1,500 ఇవ్వాలని సిబ్బంది డిమాండ్ చేశారు. తన వద్ద రూ.వెయ్యి మా త్రమే ఉన్నాయని చెప్పినా వినిపించుకోలేదు. చేసేది లేక తనకు న్యాయం చేయాలని, సిబ్బందిపై చర్యలుతీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు అశోక్ ఫిర్యాదు చేశాడు. దీంతో సూపరింటెండెంట్ సిబ్బందిపై సీరియస్ అయ్యారు. బిడ్డను అందజేశారు.

కొత్త కోటా

కొత్త రేషన్ కార్డులకు ఎదురు చూస్తున్న పేదల నిరీక్షణ ఫలించింది. కొలువుదీరిన నాటి నుంచి నేడు.. రేపు అంటూ ఆశలు రేకెత్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్డులివ్వకున్నా బియ్యం విడుదల చేసింది. కాగా రేషన్ కార్డుల్లో పేర్లు చేర్చే విషయంలో ఇప్పటి వరకు ఇంకా ఏ నిర్ణయం తీసుకోవడం లేదు.

ఈ నెల నుంచి కొత్త రేషన్ కార్డులకు ఆహార భద్రత

- రేషన్ దుకాణాలకు చేరిన 268 మెట్రిక్ టన్నుల బియ్యం
- 22,404 కుటుంబాలకు లబ్ధి
- కొత్త పేర్ల నమోదుకు 35 వేల దరఖాస్తులు పెండింగ్



చౌక ధరల దుకాణాలు	588
ఆహారభద్రత కార్డులు	2,41,622
ఎఫ్ఎస్సీ కార్డులు	14,853
అంత్యోదయ కార్డులు	26,730
అన్నపూర్ణ కార్డులు	39
ప్రతీ నెల బియ్యం సరఫరా	5,335 మెట్రిక్ టన్నులు

వికారాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేయకుండా ఎన్నికలకు ఏడాదిన్నర ముందు దరఖాస్తు దారుల్లో సగం మందికి కార్డులిచ్చి చేతులు దులుపుకొంది. ఎనిమిదేళ్ల క్రితం ఆహార భద్రతా పథకంలో భాగంగా లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఆ సమయంలో కుటుంబంలో ఉన్నవారి సంఖ్యను చేర్చింది. తదనంతరం కొందరు వివాహం చేసుకుని అత్తగారింటికి వచ్చిన వారు, వారి సంతానం వేలల్లో ఉన్నారు. మరికొందరి పేర్లు సాంకేతిక కారణాలతో తొలగించబడ్డాయి. పెళ్లి అయినవారి, జన్మించిన వారి వివరాలను కార్డులో చేర్చేందుకు నాటి నుంచి మళ్లీ అవకాశం కల్పించలేదు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తున్న నేపథ్యంలో ఆహార భద్రత కార్డుల్లో కొత్తవారిని చేర్చాలని పేదలు కోరుతున్నారు.

35 వేల దరఖాస్తులు పెండింగ్

బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఎనిమిదేళ్ల క్రితం ఆహారభద్రత లబ్ధిదారులను ఎంపిక చేసి ఆన్‌లైన్‌లో జాబితాను ఉంచింది. అనంతరం పూర్తిస్థాయి బయోమెట్రిక్ విధానం అమలు చేస్తోంది. కొత్త మెంబర్‌ను జాబితాలో చేర్చే విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో వారికి ఎనిమిదేళ్లుగా ఎదురు చూపులు తప్పడం లేదు. జిల్లాలో ఇప్పటికే 35 వేల మంది దరఖాస్తులు చేసుకుని నేటికీ నిరీక్షిస్తూనే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో కేంద్రం ఇచ్చే రేషన్‌కు దూరమవుతున్నారు.

ఈ నెల నుంచి పంపిణీ

ప్రజా పాలనలో రేషన్ కార్డుల కోసం 23,542 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి 22,404 మందిని అర్హులుగా గుర్తించారు. మిగిలిన 1,138 దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరించారు. ప్రస్తుతం జిల్లాలో కొత్త వాటితో కలుపుకొని 2,63,573 రేషన్ కార్డులు ఉన్నాయి. ఈనెల నుంచి జిల్లాలో 5,603 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయనున్నారు.



నవాబుపేట: కేజీబీవీ అధికారులతో మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

విద్యార్థులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

నవాబుపేట: ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి హెచ్చరించారు. విద్యార్థులను ఎలుకలు కరిసిన ఘటన సోమవారం వెలుగులోకి రావడంతో మంగళవారం ఆమె మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ప్రశ్నించడంతో రాత్రి వేళ ఎనిమిది మంది విద్యార్థులను ఎలుకలు కరిచాయని చెప్పారు. వారి ఆరోగ్యవిషయమై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మండల విద్యాధికారి విచ్చేసి వైద్యం చేయించారని.. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యం పరిస్థితి నిలకడగానే ఉందని చెప్పారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల విషయంలో ప్రతీ క్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి పరిస్థితి పునరావృతమైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎలుకలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఈఓ వెంట తహసీల్దార్ జైరాం, ఎంపీడీఓ అనురాధ, ఎంఈఓ అబ్దుల్ రహమాన్, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, డైరెక్టర్లు కదీర్, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

కంటికి రెప్పలా చూసుకోవాలి: భీంభరత్

పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కరిచిన విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జీ భీంభరత్ పాఠశాలకు విచ్చేశారు. జరిగిన విషయంపై విద్యార్థులు,ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులను కంటిరెప్పలా కాపాడుకోవాలని సూచించారు.ఆయన వెంట నాయకులు వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, ఎక్‌బాల్, శేఖర్,ప్రసాద్, రఘు ఉన్నారు.

ఏఐ బోధన పకడ్బందీగా నిర్వహించాలి

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన కృతిమ మేధ(ఏఐ) బోధనను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ రేణుకాదేవి అన్నారు. మంగళవారం ఆమె పట్టణంలోని సాయిపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని ఏఐ ల్యాబ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు ఏవిధంగా బోధిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ బోధనపై ఉపాధ్యాయులకు సలహాలు సూచనలిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఎల్‌ఆర్‌ఎస్ వినియోగించుకోవాలి

- ఈ నెల 31 వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే 25 శాతం రాయితీ
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన నిర్ణయాలు తీసుకుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో ఎంపీఓలు, పంచాయతీ సెక్రటరీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్ ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని సూచించారు. మార్చి 31వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే 25శాతం రాయతీ వర్తిస్తుందని చెప్పారు. అర్బన్, రూరల్, గ్రామ పంచాయతీ లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీంపై అవగాహన కల్పించాలన్నారు. 2020 ఆగస్టు 26 వరకు పదిశాతం ప్లాట్లు విక్రయించిన లేఔట్‌లకు క్రమబద్ధీకరణ వర్తిస్తుందని చెప్పారు. సబ్ రిజిస్టర్ ద్వారా నిర్ణీత నమూనాలో సేకరించిన దరఖాస్తులు ఎల్‌ఆర్‌ఎస్ కోసం మున్సిపల్ శాఖకు వివరాలు పంపించి, క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. క్రమబద్ధీకరించని భూముల్లో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతి ఉండదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలను తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, మున్సిపల్ కమిషనర్లు జాకీర్ అహ్మద్, బలరాంనాయక్, వెంకటయ్య, విక్రంసింహారెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

విజన్ లేని ముఖ్యమంత్రి పాలన



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

- మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

హుడాకాంప్లెక్స్: రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ లేకుండా పాలిస్తున్నారని, పది రూపాయల పనికి వందసార్లు ప్రభుత్వాన్ని అడగాల్సిన దుస్థితి ఏర్పడిందని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. సరూర్‌నగర్ డివిజన్ హుడాకాంప్లెక్స్‌లో మంగళవారం ఆమె పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, అధికారులను బాధ్యతగా పనిచేయించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు మాట్లాడాలని.. తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఎన్నికలప్పుడు మాట్లాడినట్లే మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలపై దృష్టి పడితే బాగుంటుందని హితవు పలికారు. వేసవి సమీపిస్తున్నందున తాగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ, శానిటేషన్ సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు లోకసాని కొండల్‌రెడ్డి, దర్పల్లి అశోక్, సుశీలరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహ్మద్ ఇస్మాయిల్, సాలమ్మ, శృతి, సునీల్‌యాదవ్, ఆకుల అరుణ్, రాజు యాదవ్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పడకేసిన పశు బీమా



- పాడి రైతుకు కరువైన భీమా
- పశువులు మృత్యువాతపడి నష్టపోతున్న దుస్థితి
- పథకం పునరుద్ధరించాలని వేడుకోలు

పరిగి: పాడి పశువులు ఏదైనా ప్రమాదం సంభవించి మృత్యువాత పడితే రైతులకు నష్టం వాటిల్లకుండా పశుబీమా ఉండేది. ప్రస్తుతం పశుబీమా నిలిచిపోవడంతో పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. పశుపెంపకం ఆధారపడిన వారు పశువులు విద్యుదాఘాతంతోనో, ఇతర అనారోగ్య సమస్యలతోనే చనిపోతే ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం మేలు రకం జాతిఆ పశువుల కొనుగోలుకు రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. ప్రమాదాలబారిన పడి పాడిపశువులు చనిపోతే రైతులు ఆర్థిక భారంతో కుదేలవుతున్నారు.

ఆరేళ్లుగా నిలిచిన పథకం

2017–18 వరకు పాడిపశువులకు బీమా పథకం అమలైంది. తదనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని పట్టించుకోవడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి వ్యవసాయం, పాడి పరిశ్రమే ప్రధాన ఆధారం. ప్రకృతి వైపరీత్యాలు, కరువు సమయంలో పాడి పశువులు ఎన్నో మృత్యువాత పడ్డాయి. దీంతో రూ.లక్షలు వెచ్చించి పశువులు కొనుగోలు చేసిన పాడి రైతులు బీమా సౌకర్యం లేక ఆర్థికంగా చతికిల పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా పశుబీమా సౌకర్యం పునరుద్ధరించాలని పాడి రైతులు కోరుతున్నారు.

40వేల లీటర్ల పాల ఉత్పత్తి

వ్యవసాయం చేస్తున్న ప్రతీ రైతు పాడి పశువులు సైతం సాకుతున్నారు. తక్కువ భూమి ఉన్న రైతులు పాడిరంగాన్ని ఎంచుకుని ఉపాధి పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,50,000 వేల పశువులుండగా ఆవులు 1,70,000, గేదెలు 80,000 ఉన్నాయి. 20 మండలాల్లో కలిపి సుమారు 40 వేల లీటర్ల పాలను రైతులు అందిస్తున్నారు. కానీ పాడినే నమ్ముకున్న రైతులకు బీమా సౌకర్యం లేక తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు.

మూడు ఆవులు మృత్యువాత



నాలుగు ఆవులతో డెయిరీ ప్రారంభించా. మూడు నెలల క్రితం రెండు ఆవులు అనారోగ్యంతో మృత్యువాత పడ్డాయి. నాలుగు రోజుల క్రితం మరో ఆవు చనిపోయింది. దీంతో దాదాపు రూ.3.5 లక్షలు నష్టం వాటిల్లింది. బీమా సౌకర్యం కల్పిస్తే ఇంత ఇబ్బంది పడేవాడిని కాదు.

– రవికుమార్, మోత్కూరు, దోమ

ఆర్థికంగా నష్టం



పశువులు మృత్యువాత పడితే తీవ్రంగా నష్టపోతున్నాం. గతంలో బీమా సౌకర్యం ఉండడంతో పశువులు చనిపోయినా కొంత డబ్బు అందేది. ఆ పథకం నిలిచిపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నాం. పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పశుబీమా సౌకర్యం కల్పించాలి.

– విష్ణువర్ధన్‌రెడ్డి, పాడి రైతు, దోమ

ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం



ప్రస్తుతం పాడి పశువులకు ఎలాంటి బీమా సౌకర్యం అందుబాటులో లేదు. ఆరు సంవత్సరాలుగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది. బీమా సౌకర్యం కల్పించాలని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందించాం. సర్కార్ నుంచి ఆదేశాలు వస్తే సమాచారం ఇస్తాం.

– సదానందం, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి, వికారాబాద్

సమస్యలు పరిష్కరిస్తాం

వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్

ఇబ్రహీంపట్నం రూరల్: వారం రోజుల్లో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో కలియ తిరిగారు. వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు ఉండేలా చూస్తామన్నారు. సిబ్బంది సైతం అందుబాటులో ఉండేలా చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ ధరకు ఇంటర్నెట్ సేవలు



ఇంటర్నెట్ సేవల గురించి తెలుసుకుంటున్న సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి

- సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి

షాద్‌నగర్: పల్లెల్లో ప్రజలకు తక్కువ ధరకే ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ పరిధిలోని హాజీపల్లి గ్రామంలో టీ ఫైబర్ ద్వారా అందిస్తున్న ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలను ఆయన ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. పల్లెల్లో ప్రజలకు ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రస్తుత కాలంలో ప్రతీ పనికి ఇంటర్నెట్ కీలకంగా మారిందన్నారు. ప్రభుత్వం తక్కువ ధరకే ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రతి ఇంటితోపాటు కార్యాలయాల్లో ఆన్‌లైన్ సేవలు టీ ఫైబర్ నెట్ ద్వారా సులభతరం అవుతాయన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా హాజీపల్లిలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని.. త్వరలో అన్ని గ్రామాల్లో ఇంటర్నెట్ సేవలను విస్తరించనున్నట్లు వివరించారు. అనంతరం గ్రామంలోని ఇంటర్నెట్ ఉన్న ఇళ్లకు, పూరి గుడిసెల్లోకి వెళ్లి వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీఫైబర్ ఎండీ ప్రవీణ్, డీపీఓ సురేష్‌మోహన్, ఆర్డీఓ సరిత, తహసీల్దార్ పార్థసారధి, ఎంఈఓ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశం ఔషధ మొక్కలకు పుట్టినిల్లు



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్ శర్మ

కడ్తాల్: అనాది నుంచి భారతదేశం ఔషధ మొక్కలకు పుట్టినిల్లు అని బెంగళూరుకు చెందిన ఆయుర్వేద చికిత్స నిపుణుడు డాక్టర్ చంద్రశేఖర్ శర్మ పేర్కొన్నారు. అన్మాస్‌పల్లి పంచాయతీ పరిధిలోని ఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం 'ప్రకృతి ఒడిలో ఒక రోజు' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రావిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు పర్యావరణవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ శర్మ మాట్లాడుతూ.. ఔషధ మొక్కల ఔన్నత్యాన్ని, ప్రాముఖ్యతను గుర్తించి జీవన గమనంలో భాగం చేసుకోవాలని సూచించారు. సీజీఆర్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో ఔషధ మొక్కలు పెంచుకొని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకుడు మాధవరెడ్డి, ఉపాధ్యాయులు శేఖర్, జగదీశ్, సీజీఆర్ ప్రతినిధులు జ్ఞానేశ్వర్, నాగేశ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని వినియోగించుకోవాలి

కొడంగల్ మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్

కొడంగల్ రూరల్: జీఓ 28 ప్రకారం మార్చి 31లోగా ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సదవకాశాన్ని ప్లాటు యజమానులు సద్వినియోగం చేసుకుని ప్లాటును క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

ఎర్రమట్టి తరలిస్తున్న ఏడుగురి బైండోవర్

నవాబుపేట: అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో నుంచి ఎర్ర మట్టి తరలిస్తున్న ఏడుగురిని మంగళవారం తహసీల్దార్ జైరాం ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ అరుణ్ కుమార్ తెలిపారు. వీరిలో గెరిగెట్‌పల్లికి చెందిన పట్నం ప్రవీణ్‌కుమార్, కేషవపల్లికి చెందిన గొండ్ల శ్రీనివాస్‌గౌడ్, అక్కనోళ్ల నర్సింహారెడ్డి, ఆర్కతలకు చెందిన కుమ్మరి అంజనేయులు, బూరగోని రాంచందర్, గుండాల మధుసూదన్‌రెడ్డి, గుండాల విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నట్లు తెలిపారు. అక్రమంగా మట్టి, ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కడ్తాల్: నూతన సాంకేతిక పరిజ్ఞానం(సీఈఐఆర్)తో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను వెతికి పట్టుకుని సీఐ శివప్రసాద్ బాధితులకు అందజేశారు. మండల పరిధిలోని గోవిందాయిపల్లికి చెందిన జంగయ్య, ఎక్వాయిపల్లికి చెందిన నర్సింహగౌడ్, తలకొండపల్లి మండలం పడకల్‌కు చెందిన హరికృష్ణ, కందుకూర్‌కు చెందిన సాయికుమార్‌లు ఇటీవల వేర్వేరు చోట్ల తమ సెల్ ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ ఉపయోగించి సెల్‌ఫోన్లను వెతికి పట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు అప్పగించారు. ఎవరైనా సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నా, చోరీకి గురైనా ఫోన్ వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడంతో తిరిగి పొందే అవకాశం ఉంటుందని సీఐ తెలిపారు.

గోడకు కన్నం వేసి వైన్స్‌లో చోరీ

రూ.50 వేల అపహరణ



దుండగులు పగలగొట్టిన వైన్స్ గోడ

షాబాద్: గుర్తు తెలి యని వ్యక్తులు ఓ వైన్ షాపు గోడను పగలగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మూడేళ్లుగా మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన కప్ప హరిబాబు నాగర్‌గూడ దుర్గా వైన్స్‌లో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి వైన్ షాపు బంద్ చేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం 10:30కి వచ్చి షాపు తెరిచి చూసే సరికి చిందరవందరగా ఉంది. కౌంటర్‌లో ఉన్న రూ.50 వేల నగదు, సీసీ కెమెరా డివైజ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. షాపు వెనుక నుంచి వెళ్లి రెండు ఫీట్ల గోడను పగలగొట్టి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. హరిబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రదక్షిణలు.. పడిగాపులు

- పూర్తి రుణమాఫీ అమలయ్యేదెన్నడో?
- మోత్కూర్ పీఏసీఎస్‌లో 499 మంది రైతులకు మొండిచేయి
- అయోమయంలో అన్నదాతలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



మోత్కూర్ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం

దోమ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణమాఫీ రైతులందరికీ పూర్తిస్థాయిలో ఎప్పుడు అమలవుతుందోనని ఆశతో ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చి 14 నెలలు గడుస్తున్నా ఇంతవరకు సంపూర్ణంగా రుణమాఫీ కాలేదు. దీంతో నిత్యం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరోవైపు బ్యాంకుల్లో తీసుకున్న రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న వారు మొత్తం చెల్లిస్తే మిగతావి మాఫీ చేస్తామని పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతులు అప్పులు తెచ్చి మరీ బ్యాంకుల్లో రుణాలు చెల్లించారు. అయితే ఇప్పటివరకు రూ.2లక్షల మాఫీ సొమ్ము సర్కారు నుంచి విడుదల కాలేదు.

తప్పని ఎదురుచూపులు

మండలంలో పీఏసీఎస్ సొసైటీలో 1,598 మంది రైతులు ఉండగా రూ.8.94 లక్షల రుణాలను అధికారులు అందజేశారు. అందులో 1,099 మంది రైతులకు ఇప్పటివరకు రూ.6.12 లక్షలు మాఫీ అయ్యాయి. కాగా మిగతా 499 మంది రైతులకు రూ.2.82 లక్షలు నేటికి రుణమాఫీ కాలేదు. దీంతో నిత్యం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అధికారులతో రుణమాఫీ గురించి పలుమార్లు ఆరా తీసినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు.

మాఫీ కాని రైతుల ఆగ్రహం

నాలుగో విడత రుణమాఫీకి సంబంధించి అంతా గోప్యత పాటిస్తుండడంతో రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. దీనిపై ఏ అధికారిని అడిగినా తమకు తెలియదంటూ దాట వేస్తుండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అట్టహాసంగా ఏడాది ప్రజాపాలన ఉత్సవాల్లో ప్రకటించి ఇప్పుడు ప్రజాప్రతినిధులు సైతం నోరు మెదపకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే జాబితా ప్రకారం రుణమాఫీ డబ్బులు విడుదల చేయాలని ఆయా గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఇంకా సాంకేతిక సమస్యలతో రూ.రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులంతా మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. వారందరిలో రుణమాఫీ జరుగుతుందో? లేదోనని ఆందోళన నెలకొంది.

నిత్యం తిరుగుతున్నా



ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా నేటికీ రుణమాఫీ కాలేదు. నాకు నాలుగు ఎకరాల భూమి ఉండగా, అందులో పీఏసీఎస్ సొసైటీలో గతంలో రూ.లక్ష రుణం తీసుకున్నా. ఇప్పటివరకు ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు. నిత్యం అధికారుల చుట్టూ తిరుగుతున్నా.

– పెద్దమల్లయ్య, రైతు, కొత్తపల్లి

ప్రభుత్వం నుంచి లిస్టు రాగానే..



పీఏసీఎస్‌లో 1,598 మంది రైతులు ఉండగా, అందులో 499 మందికి రుణమాఫీ కాలేదు. వారి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. పలువురు కార్యాలయం చుట్టూ నిత్యం చక్కర్లు కొడుతున్నారు. ప్రభుత్వం నుంచి లిస్టు రాగానే పరిశీలించి మాఫీ చేస్తాం.

– యాదగిరి, సీఈఓ, పీఏసీఎస్, మోత్కూర్

ఆందోళన చెందొద్దు



రుణమాఫీ కానీ రైతులు కార్యాలయానికి వచ్చి అడుగుతున్నారు. ప్రస్తుతం జాబితాను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి డబ్బులు విడుదల కాగానే అర్హులకు రుణమాఫీ వర్తించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఎవరూ ఆందోళన చెందొద్దు.

– ప్రభాకర్‌రావు, వ్యవసాయఅధికారి, దోమ

జర్నలిస్టుల భూమి సర్వే చేయండి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన మీడియా బృందం



తహసీల్దార్ తారాసింగ్‌తో మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్టులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం గుట్ట సమీపంలో జర్నలిస్టులకు సంబంధించిన భూమిలో సర్వే నిర్వహించాలని సీనియర్ జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ తారాసింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ.. అంతారంగుట్ట పైన సర్వే నంబరు 116, 117లో ఉన్న తమ భూమిని సర్వే చేసి కేటాయించాలని కోరారు. తహసీల్దార్ స్పందిస్తూ.. సర్వేయర్ మహేశ్ సెలవుల్లో ఉన్నారని, ఆయన వచ్చిన వెంటనే సర్వే చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు శ్రీనివాస్‌చారి, వేణుగోపాల్‌రెడ్డి, లింగేశ్, వెంకట్‌రెడ్డి, శివానంద్, వెంకట్రాంరెడ్డి, శాంతు, సంగమేశ్వర్ ఉన్నారు.

అలరించిన ఒగ్గు కళా ప్రదర్శన

బొంరాస్‌పేట: మండల పరిధిలోని నాందర్‌పూర్‌లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు నిర్వహించిన శ్రీమల్లికార్జున స్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని ఒగ్గు బీరప్ప డోలు కళాబృందంతో నిర్వహించిన ప్రదర్శన, కథ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు కనువిందు చేశాయి. ఈ కార్యక్రమంలో తాలూకా యాదవసంఘం అధ్యక్షుడు మన్నె బస్వరాజ్ యాదవ్, కురుమ సంఘం నాయకులు మహేశ్, అన్నయ్య, పాండు, నర్సింలు, పుర్ర వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో ఒగ్గుడోలు విన్యాసాలు



అమ్మవారి దర్శనం కోసం భక్తుల క్యూ

పోలేపల్లి.. భక్తులు ప్రణమిల్లి

దుద్యాల్: ప్రసిద్ధిగాంచిన పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయం జన సందోహంగా మారింది. మంగళవారం అమ్మవారికి మొక్కులు చెల్లించే రోజు కావడంతో భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. కోడి పుంజులు, మేకపోతులను బలిచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా క్యూలైన్లు నిండిపోవడంతో దర్శనానికి గంటకు పైగా సమయం పట్టిందని భక్తులు వాపోయారు. అనంతరం బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం, మంగళవారం, శుక్రవారం రోజుల్లో దాదాపు 5 వేలకు పైగా భక్తులు దర్శించుకుంటున్నట్లు ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి, చైర్మన్ జయరాములు తెలిపారు.



బోనాలతో ఆలయం ఎదుట కోలాహలం

ఒక భవనం.. మూడు శాఖలు!

- గదిలో పాఠశాల, వరండాలో అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ నిర్వహణ
- సంత్రకుంట తండాలో అవస్థలు పడుతున్న విద్యార్థులు
- పాఠాలు అర్థం కావడం లేదని గగ్గోలు
- నూతన భవనం నిర్మించాలని విజ్ఞప్తి

దుద్యాల్: చాలీచాలని వసతులతో ఆ చిన్నారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నాలుగు అక్షరాలు నేర్చుకొని ప్రయోజకులు అవుతారని ఆశపడ్డ వారి తల్లిదండ్రులకు గదుల సమస్య నీడలా వెంటాడుతోంది. మండలంలోని సంత్రకుంట తండాలో ఒకే భవనంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పంచాయతీ కార్యాలయం నిర్వహించడంతో విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సరిపడా గదులు లేకపోవడమే సమస్యను మరింత జటిలం చేసింది. ఈ భవనంలో ఉన్న గదిలో ఉపాధ్యాయులు 20 చిన్నారులతో పాఠశాల నిర్వహిస్తుండగా, వరండాలో ఒక పక్క అంగన్‌వాడీ కేంద్రం, మరోపక్క గ్రామ పంచాయతీ కార్యాలయాలను కొనసాగిస్తున్నారు.

అంగన్‌వాడీలో బాలల అల్లరి

మూడు శాఖలకు సంబంధించిన కార్యకలాపాలు ఒకే భవనంలో జరుగుతుండడంతో చాలా ఇబ్బందిగా ఉందని విద్యార్థులతో పాటు తండావాసులు వాపోతున్నారు. తరగతులు జరిగేటప్పుడు అంగన్‌వాడీ బాలలు చేసే అల్లరితో ఇబ్బందులు తప్పడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించి ఏవైన పనులు సాగుతున్నప్పుడు గ్రామస్తులు వచ్చి పెద్దగా మాట్లాడుతుంటారు. దీంతో చదువుపై దృష్టి సారించలేకపోతున్నమని విద్యార్థులు మదన పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వేరు వేరుగా కార్యకలాపాలు సాగేలా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని తండావాసులు కోరుతున్నారు.



మూడు కార్యకలాపాలు సాగుతున్న సంత్రకుంట తండా పాఠశాల భవనం

భూమి పూజకు నోచుకోక...

ఒకే భవనంలో మూడు కార్యకలాపాలు సాగిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని గమనించి ప్రభుత్వం రూ.41 లక్షలతో పాఠశాల భవనాన్ని మంజూరు చేసింది. కానీ నెలలు గడుస్తున్నా నేటికీ భూమి పూజకు నోచుకోలేదు. అత్యవసరం ఉన్న చోటే నిర్మాణం త్వరగా చేపడితే అక్కడ పరిస్థితులు మారుతాయని ప్రజలు భావించినా ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వచ్చే విద్యా సంవత్సరం వరకు భవనం అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



గదిలో సాగుతున్న పాఠశాల తరగతులు

ఉద్యాన పంట.. ఆదరణ కరువంట

నిలిచిన ప్రభుత్వ సబ్సిడీలు

- ఆందోళనకు గురవుతున్న రైతులు



మోమిన్‌పేటలో పందిరిపై సాగు చేస్తున్న కాకర

మోమిన్‌పేట: కూరగాయలు సాగు చేసే రైతులకు సబ్సిడీలు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. విత్తనాలు, మల్చింగ్, పందిరి ఏర్పాటుకు ఇచ్చే రాయితీలను ప్రభుత్వం పూర్తిగా నిలిపి వేసింది. కూరగాయ పంటలకు మద్దతు ధర లేకున్నా సాగుకు అవసరమైన పరికరాలు సబ్సిడీపై అందించాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలంటే బిందు సేద్య పరికరాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని అధికారులు పేర్కొంటుండంతో 90శాతం సబ్సిడీపై ప్రభుత్వం గతంలో అందించేది. ఎకరాకు రూ.10వేల నుంచి రూ.15వేలతో డ్రిప్ పరికరాలు అందేవి. ప్రస్తుతం రూ.60వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు లబోదిబోమంటున్నారు.

భగ్గుమంటున్న విత్తనాలు

60 మంది రైతులు వివిధ కూరగాయ పంటల సాగుకు మల్చింగ్ పేపర్‌ను సొంత డబ్బుతో కొనుగోలు చేసి సాగు చేశారు. ప్రభుత్వం ఎకరాకు రూ.6,400లను సబ్సిడీ కింద రైతు ఖాతాలో జమ చేసేది. ఎస్సీ, ఎస్టీ రైతులకు మాత్రమే సబ్సిడీ అందుబాటులో ఉందంటున్నారు. తీగ జాతి కూరగాయల సాగుకు పందిరి ఏర్పాటుకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందించేది. గత ప్రభుత్వం పూర్తిగా రాయితీలను నిలిపి వేసింది. హైబ్రిడ్ రకం కూరగాయ విత్తనాలకు మార్కెట్‌లో ఎక్కువ ధరలు పలుకుతున్నాయి. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇవ్వడంతో రైతులకు కొంత ఊరట లభించేది. ప్రస్తుతం అవి కూడా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆలుగడ్డ సాగు మండలంలో గణనీయంగా తగ్గింది. విత్తనాల రేటు ఎక్కువ ఉండడంతో 1200 ఎకరాల నుంచి 500 ఎకరాలకు పడిపోయింది.

సబ్సిడీ రాలేదు



ఒక ఎకరాలో టమాటా సాగుకు మల్చింగ్ వేశాను. రూ.12,700 వరకు ఖర్చు వచ్చింది. ప్రభుత్వం రూ.6,400 సబ్సిడీ కింద ఇస్తుందన్నారు. ఆరు నెలలు కావొస్తున్నా ఇప్పటికీ ఒక్క రూపాయి రాలేదు.

– ప్రభాకర్‌రెడ్డి, రైతు, ఎన్కేపల్లి

దరఖాస్తులు చేసుకోవచ్చు



పందిరికి దరఖాస్తులు చేసుకోవచ్చు. ఎకరాకు రూ.లక్ష సబ్సిడీ వస్తుంది. సిమెంటు, లేక రాయి పిల్లర్లు వేసుకోవాలి. బిందు, తుంపర సేద్య పరికరాల సబ్సిడీకి ప్రస్తుతం నిధులు అందుబాటులో లేవు. వంకాయ, టమాటా, పచ్చిమిర్చి నారు జీడిమెట్లలో ఉచితంగా ఇస్తున్నారు.

– అక్షితరెడ్డి, ఇన్‌చార్జి ఉద్యానశాఖ అధికారి

పుష్కరిణిలో మునిగి వ్యక్తి మృతి

- స్నానం చేసే క్రమంలో ప్రమాదం
- మృతుడు గోనూరువాసి



బిచ్చప్ప మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ జాతరకు వచ్చిన ఓ భక్తుడు స్నానం చేసేందుకు పుష్కరిణిలో దిగి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం గోనూరుకు చెందిన కురువ బిచ్చప్ప(45) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బతుకుదెరువు కోసం నాలుగేళ్ల కిత్రం భార్య శివలీల, కూతురుతో కలిసి అత్తగారి గ్రామమైన చేవెళ్ల మండలం కిష్టాపూర్ వచ్చాడు. ఇక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం చేవెళ్లలో జరుగుతున్న జాతరకు వెళ్దామని భార్యతో అన్నాడు. సాయంత్రం వెళ్దామని చెప్పిన ఆమె.. కూలీ పనికి వెళ్లింది. దీంతో బిచ్చప్ప ఒక్కడే చేవెళ్లకు చేరుకున్నాడు. స్నానం చేసేందుకు ఆలయ సమీపంలోని పుష్కరిణిలోకి దిగాడు. ప్రమాదవశాత్తు కాలు జారడంతో ఈత రాక నీటిలో మునిగిపోయాడు. అక్కడే ఉన్న పలువురు భక్తులు ఇది గమనించి బయటకు తీయగా, అప్పటికే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య శివలీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో సీసీ రోడ్లు



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

దుద్యాల్: మండల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణానికిగాను రూ.1.20 కోట్ల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ సత్యనారాయణరెడ్డి, డీఈ సుదర్శన్‌రావు, ఏఈ సురేందర్‌రెడ్డి, కొడంగల్ ఎంపీసీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్‌పాషా, మాజీ సర్పంచ్ ఖాజా, గ్రామస్తులు సాయన్న, సత్యనారాయణ, అశోక్, హాజీ, శాంతు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పతున్న వ్యక్తి రిమాండ్

పరిగి: దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పట్టుకొని రిమాండ్‌కు తరలించిన ఘటన పరిగి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 1న పట్టణ కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి సయ్యాద్ ఫెరోజ్ ఇంట్లో దొంగతనం చేసి పారి పోతుండగా కుటుంబసభ్యులు పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో దొంగ వారిని కొట్టి పరారయ్యాడు. దీంతో బాధితులు అదే రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మంగళవారం పెట్రోలింగ్ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న వ్యక్తిని పట్టుకొని విచారించారు. అతను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సంతనూతలపాడు గ్రామానికి చెందిన తన్నీరు శ్రీనుగా గుర్తించారు. ఇతడు కరీంనగర్ జిల్లాలో పలు చోరీలు పాల్పడగా అక్కడి పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకి పంపించారు. 2023లో జైలు నుంచి వచ్చి మళ్లీ దొంగతనాలకు పాల్పడ్డాడు. సుల్తాన్‌పూర్‌లో బంగారు ఆభరణాలు చోరీలకు పాల్పడ్డగా షాద్‌నగర్ పట్టణంలో నగదు దొంగతనం, ఎన్టీఆర్‌నగర్‌లో ఈ నెల 1న దొంగనానికి పాల్పడినట్లు తేలింది. అతని నుంచి 2.5 తులాల బంగారం, 1.5 తులాల వెండి, రూ.2,000 నగదును స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



రాకేశ్ మృతదేహం

కందుకూరు: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన వివరాలు. మండల పరిధిలోని పులిమామిడికి చెందిన రేవెళ్లి ఏసయ్య కుమారుడు రాకేశ్(23) హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తాను ప్రేమించిన యువతి నిరాకరించిందనే మనస్తాపంతో మంగళవారం ఉదయం ఇంట్లోని పైకప్పు కొండీలకు లుంగీతో ఉరేసుకున్నాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.